క్లుప్తంగా

మాలకొండ ఆలయ ఆదాయం రూ.9,35,692

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆదాయం శనివారం రూ.9,35,692 వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.19,400, తలనీలాలు రూ.40,500, ప్రత్యేక దర్శనం రూ.3,55,400, రూమ్ అద్దెలు రూ.32,780, లడ్డు ప్రసాదాలు రూ.2,13,460, అన్నదానం రూ.2,29,446 ఇతర విరాళాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

365 బేళ్లు తిరస్కరణ


వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 365 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని జగ్గరాజుపాలెం, ఎస్ఎస్‌కండ్రిక, పెట్లూరు, వర్గినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 961 బేళ్లను వేలానికి తీసుకురాగా 596 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.330, కనిష్ట ధర రూ.110, సరాసరి ధర రూ.204.95గా నమోదైంది. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి.

పొగాకు అక్రమ కొనుగోళ్లు చేయవద్దు


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: పొగాకు అక్రమ కొనుగోళ్లు, అమ్మకాలు చేయవద్దని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా అక్రమ పొగాకు బేళ్లు తరలిస్తుంటే బోర్డు వారికి సమాచారం ఇవ్వాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో జమ్ములపాలెం, తుమాడు గ్రామాలకు చెందిన రైతులు 850 బేళ్లను వేలానికి తీసుకురాగా 642 బేళ్లను కొనుగోలు చేసి 208 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.331, కనిష్ట ధర రూ.125, సరాసరి ధర రూ.244.05 పలికింది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

- రూ.42,800 నగదు స్వాధీనం

మద్దిపాడు: పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు జూదరులను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.42,800 స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని శివరాయునిపేట గ్రామశివారులో పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకున్న ఎస్సై రమేష్‌బాబు సిబ్బందితో దాడి చేసి ఆరుగురు జూదరులను అదుపులోనికి తీసుకున్నారు.


ఊరు ఖాళీచేయమని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మా ఊరు ఖాళీ చేయం

ఉలవపాడు:

భూసేకరణ కోసం తమ గ్రామం ఖాళీ చేయమని కరేడు పంచాయతీ ఉప్పరపాలెం గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం గ్రామ తీర్మానాన్ని బ్యానర్ రూపంలో ప్రకటించి గ్రామపొలిమేరలో ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. గ్రామ సభలో చేసిన తీర్మానం ప్రకారం తమ భూములు, ఇళ్లు ఇవ్వకూడదని నిర్ణయించినట్లు తెలిపారు. ఇండోసోల్ కంపెనీకి పంటలు పండని బీడు భూములు ఇవ్వాలని, తమ భూములు ఇవ్వబోమని వారు చెప్పారు. తాము ఇక్కడ స్వేచ్ఛగా జీవిస్తున్నామని, తమను తరలించడం అన్యాయమని నినాదాలు చేశారు. తమ భూములను కాపాడాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉప్పరపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఉప్పరపాలెం గ్రామస్తులు


కందుకూరు రోడ్డులో డిపో వద్ద వంతెన దుస్థితి


పొదిలి రోడ్డులో బ్రిడ్జి వద్ద రోడ్డు దుస్థితి


చాకిరాల రోడ్డులో వంతెన ఇలా

పట్టించుకోకుంటే ప్రమాదమే..!

- బ్రిడ్జిలు, వంతెనల్లో పొంచి ఉన్న ప్రమాదం
- గుంతలమయంగా రోడ్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- గుంతల రోడ్లలో ప్రయాణికులకు అవస్థలు


కంభం రోడ్డులో బ్రిడ్జి వద్ద రోడ్డు దుస్థితి

కనిగిరిరూరల్: మండలంలో ప్రధాన రహదారులు, వంతెనలు, బ్రిడ్జిల మరమ్మతులను మరిచిపోయారు. దీంతో అవి ప్రమాదభరితంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల ఊకదంపుడు మాటలే మినహా క్షేత్రస్థాయిలో వాటి గురించి పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఆ రోడ్లలో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి అనుకుని అనేక ప్రధాన రహదారులు ఛిద్రంగా మారి ప్రమాధ ఘంటికలు మోస్తున్నాయి. కొన్ని చోట్ల వాహన చోదకులు, ట్రాక్టర్ వారే గుంతలు పూడ్చిన సందర్భాలు ఉన్నాయి. భారీ గ్రావెల్, గ్రానైట్ లారీల రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు, బ్రిడ్జిలు మరింత కృంగి, ఛిద్రంగా మారుతున్నాయి. రోడ్ల, బ్రిడ్జిల అధ్వాన్న దుస్థితిపై పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చినప్పుడు తాత్కాలిక చర్యల్లో భాగంగా తారు, కంకర పైపైన వేసి గుంతలు పూడ్చి కంటి తుడుపు చర్యగా మమ అనిపిస్తున్నారు. తిరిగి భారీ వాహనాలు ప్రయాణించినా, వర్షాలు కురిసినా అక్కడ గుంతలు బయటపడి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

➤ కనిగిరి పొదిలి రహదారిలో నిత్యం వాహనాలు వందల సంఖ్యలో జరుగుతుంటాయి. పురాతన కాలం నాటి రెండు బ్రిడ్జిలు అవసాన దశకు చేరాయి. ఆ బ్రిడ్జిలపై అక్కడక్కడ గుంతలు, బయపడిన ఇనుప చువ్వలు, రోడ్డుపై తేలిన కంకర రాళ్లతో అధ్వాన్న స్థితిలో ప్రమాద భరింతగా మారాయి. చెక్‌పోస్ట్ వద్ద ఉన్న బ్రిడ్జికి ప్రొటక్షన్ వాల్స్ పురాతనంగా మారి ఉండగా చెరువు వద్ద ఉన్న ప్రధాన బ్రిడ్జికి కనీస రక్షణ లేదు. రాత్రిళ్లు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

➤ కనిగిరి కంభం రోడ్డు పరిస్థితి మరింత దయనీయం.. సాధన రెస్టారెంట్ వద్ద ఉన్న రోడ్డంతా గోతులమయం. అక్కడి ప్రధాన బ్రిడ్జి ప్రమాధ ఘంటికలు మోగిస్తోంది. చెరువు వైపు ఉన్న కంభం రోడ్డు.. ధోభి ఘాట్ వరకు ఛిద్రంగా ఉంది. ఈ రెండు రోడ్లలో నిత్యం భారీ గ్రావెల్ లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లన్నీ కుంగిపోయాయి.

➤ కనిగిరి -కందుకూరు రోడ్డులో డిపో డౌన్‌లో ఉన్న ప్రధాన బ్రిడ్జి కుంగిపోయింది. బ్రిడ్జికి సైడ్ వాల్స్ విరిగిపోయాయి. ప్రొటెక్షన్ వాల్స్ లేవు. కొత్త వాహనాలు ఆ వైపు వస్తే ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కనిగిరి- చాకిరాల రోడ్డులో చాకిరాల ఎస్సీ కాలనీలో ప్రధాన బ్రిడ్జి పురాతనకాలం నాటిది. బ్రిడ్జిలోని ఇరన్ చువ్వలో బయటపడి ఇటీవల బ్రిడ్జి మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు తాత్కలిక చర్యలు చేపట్టి మమ అని పించారు. మళ్లీ మంచి వర్షాలు పడితే ప్రమాదం తప్పవని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇక గార్లపేట రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఉన్న రోడ్డు బ్రిడ్జి, ప్రధాన రోడ్డు అంతా ఛిద్రంగా మారి ప్రమాధభరితంగా ఉంది. దాదాపు పైన చెప్పిన బ్రిడ్జి రహదారులన్నీ లింకుదారులే.. ఇవి దాటితే అటు వైపుకు వెళ్లే పరిస్థితి. సమస్య తీవ్రతరం అయినప్పుడు హడావుడి చేయడం కంటే ముందస్తుగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పట్టుకున్న బియ్యం ఎక్కడివి..?

- కేసు నిగ్గు తేలుస్తారా..నీరు గారుస్తారా..?
- వారం రోజులు గడుస్తున్నా ముందుకు సాగని విచారణ


పట్టుబడిన రేషన్, పాఠశాల బియ్యం(ఫైల్)

కనిగిరిరూరల్: పట్టణంలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుండగా ప్రజాసంఘాల నాయకులు వారంరోజుల క్రితం పట్టుకున్న విషయం విదితమే. సుమారు 235 బస్తాల రేషన్ బియ్యాన్ని, లారీని పట్టుకొని రెవెన్యూ, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు అప్పగించారు. ఆ బియ్యంలో సుమారు 136 బస్తాలు పాఠశాలల సన్నబియ్యంగా అధికారులు గుర్తించారు. కేసులో లారీ ఓనర్, డ్రైవర్‌లపై 6ఏ కేసులు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేశారు. అయితే పట్టుకున్న 136 బస్తాలు పాఠశాల రేషన్ బియ్యం ఎక్కడివి అనేదాన్ని వారం రోజులైన అధికారులు తేల్చలేదు.

నిగ్గు తేలుస్తారా..నీరు గారుస్తారా..?

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం బియ్యం విషయంలో ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని, స్టాక్, లెక్కల్లో తేడాలు వస్తే కఠిన చర్యల తప్పవని కలెక్టర్, ఉన్నత స్థాయి అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా ఆ బియ్యం కూడా పక్కదారి పడుతున్నాయి. ఈ నెల 3న బుధవారం రాత్రి పట్టుబడిన రేషన్ బియ్యం లారీలో కేవలం కొద్ది బస్తాల బియ్యం మాత్రమే రవాణాకు ఎగుమతి జరిగాయి. అందులో అధిక శాతం పాఠశాలల బియ్యమే. బియ్యం లారీ పట్టుబడిన ఏరియాలో మూడు రేషన్ షాపులు, పాఠశాలలు ఉన్నాయి. అయితే పిల్లల పాఠశాలల బియ్యం కూడా దాదాపు ఆ ఏరియాలో నుంచే స్టాక్ ఎత్తి ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ఎన్‌ఫోర్స్ మెంట్, విజిలెన్స్ అధికారులు, లేదా విద్యా శాఖ అధికారులు దీనిపై దృష్టి పెడితే ఒక్క రోజులో నిజం నిగ్గు తేల్చవచ్చు. పట్టుబడిన మధ్యాహ్న భోజన పథకం బియ్యం ఏ పాఠశాలకు చెందినవి, లేదా ఏ అంగన్‌వాడీ స్కూల్‌కు చెందినవి.. లేదా నేరుగా గోడౌన్ స్టాక్‌పాయింట్ నుంచి లిఫ్ట్ చేశారా ..? అనేది తేల్చడం అధికారులకు పెద్ద సమస్య కాదు. కానీ అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తోన్నారో అర్థం కావడం లేదు.

నత్తనడకన విచారణ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు పాఠశాలల్లోని కుకింగ్ ఏజెన్సీలన్నీ అధికార పార్టీ నేతల చేతుల్లోకి మారాయి. దీంతో ముందుకు వెళితే నేతలతో ఇబ్బంది మనకు ఎందుకు అనుకున్నారేమో గానీ విచారణ చేయకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు పట్టుబడిన ఎండీఎం బియ్యంపై కనీస సమాచారం, సమగ్ర దర్యాప్తు కోసం విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు కానీ సహాయ సమాచారం కూడా లేదని తెలిసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా విచారణ చేసిన దాఖలాలు లేవు. బియ్యం పట్టుబడి వారం రోజులు దాటినా ఇంత వరకు విచారణ జరగకపోవడం శోచనీయం.

విచారిస్తున్నాం

రేషన్ బియ్యం అక్రమ రవాణ కేసులో రేషన్ షాపు 15పై కూడా కేసు నమోదు చేశాం. మధ్యాహ్న భోజన పథకం బియ్యం ఏ రేషన్ షాపు నుంచి ఎత్తారు, ఆ బియ్యం ఏ పాఠశాలకు లేదా అంగన్‌వాడీ కేంద్రానికి చెందినవా అన్నది సమగ్ర విచారణ చేస్తున్నాం. అవసరమైతే విద్యాశాఖ అధికారుల సహాయం తీసుకుని విచారణ సాగిస్తాం.

– రాఘవేంద్ర, ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ

లోక్ అదాలత్‌లో 188 కేసుల పరిష్కారం

సింగరాయకొండ:

లోక్ అదాలత్‌లో సుమారు 188 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ వి.లీలా శ్యాం సుందరి తెలిపారు. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి లీలా శ్యాంసుందరి మాట్లాడుతూ వివాదాలను పరస్పర సమ్మతితో పరిష్కరించుకోవటానికి లోక్ అదాలత్ అనువైన వేదిక అన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరగటానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి 13 కేసులు పరిష్కారమైనట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, సభ్యులు బి.వెంకటేశ్వర్లు, పి.సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: స్థానిక కోర్టులో ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 95 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టుల్లో 7 కేసుల చొప్పున, అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో 81 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. లోక్ అదాలత్ కోర్టు అనేది కేసులను సులభంగా పరిష్కరించుకునేందుకు ఒక సులభమైన మార్గమని, రాజీమార్గంలో సులభంగా కేసులు పరిష్కరించుకోవచ్చునని సూచించారు. దీని వల్ల కక్షిదారులకు కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగే ఇబ్బందులు తప్పుతాయని వివరించారు. కక్షిదారులు రాజీచేసుకోదగిన కేసులను లోకా అదాలత్ కేసులో పరిష్కరించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బెజవాడ క్రిష్ణయ్యచౌదరి, న్యాయవాదులు సాంబశివరావు, సీహెచ్ హరిక్రిష్ణ, మస్తాన్‌వలి, మామిళ్లపల్లి మల్లికార్జున, షంషుద్దీన్, లక్ష్మీనారాయణ, బ్రహ్మయ్య, భాస్కర్, జి.కోటేశ్వరరావు, మురళీధర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో 809 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.రూపశ్రీ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసులు 46, సివిల్ కేసులు 3, భరణం కేసులు 4, ఎస్‌టీసీ 756 కేసులను ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు జడ్జి వెల్లడించారు. కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్లేనన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


కందుకూరులో కేసులు విచారిస్తున్న న్యాయమూర్తులు


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి లీలా శ్యాంసుందరి


కనిగిరిలో జాతీయ లోక్ అదాలత్

రాష్ట్రస్థాయి జానపద నృత్య పోటీలకు ఎంపిక


ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఎస్‌పురం కేజీబీవీ విద్యార్థినులు

సీఎస్‌పురం(పామూరు): కళా ఉత్సవ్ 2025–26 రాష్ట్రస్థాయిలో జరగనున్న ప్రాంతీయ జానపద/గిరిజన నృత్యం గ్రూప్ పోటీలకు సీఎస్‌పురం కేజీబీవీ విద్యార్థినులు ఎంపికైనట్లు విద్యాలయ ఎస్‌ఓ షేక్.రేష్మ శనివారం తెలిపారు. జిల్లాస్థాయి కళా ఉత్సవ్ 2025–26 పోటీలు ఈనెల 11, 12 తేదీల్లో మైనంపాడు డైట్ కళాశాలలో నిర్వహించగా ప్రాంతీయ జానపద/గిరిజన నృత్యం గ్రూప్ విభాగంలో సీఎస్‌పురం కేజీబీవీకి చెందిన 10వ తరగతి విద్యార్థినులు పూజ, గురునవ్య, నవ్యశ్రీ, సరస్వతిలు సత్తాచాటి జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నట్లు ఎస్‌ఓ షేక్.రేష్మ తెలిపారు. వీరు ఈనెల 23 అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో గిరిజన నృత్యం గ్రూపు విభాగంలో ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎస్‌ఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం


బాండ్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పీసీపల్లి: మండల పరిధిలోని పడమటపల్లి గ్రామానికి చెందిన పూమాటి రమణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు పీసీపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 2000 బ్యాచ్ విద్యార్థులు రూ.50 వేలు వసూలు చేసి రమణయ్య కుమార్తె మానసకు అందజేశారు. కార్యక్రమంలో చందలూరు రమేష్, రమేష్, కొండ్రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, స్నేహితులు పాల్గొన్నారు.

హామీలపై నేతలను నిలదీయండి


బుక్కాపురంలో బాబుష్యూరిటీ మోసంగ్యారెంటీ పత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

పామూరు: మోసపూరిత హామీలతో గద్దెనెక్కి అధికారం చేపట్టిన తరువాత బురిడీ కొట్టిస్తున్న సీఎం చంద్రబాబును, కూటమి నాయకులను క్షేత్రస్థాయిలో ప్రజలు నిలదీయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలో శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, రీకాల్ బాబూస్ మేనిఫెస్టో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలపార్టీ అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి కూటమి ప్రభుత్వం ప్రజలను చేస్తున్న మోసంపై వివరిస్తూ స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రచార పత్రాలను, క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించి, కూటమి నాయకులు సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన అబద్ధపు హామీలు, అమలుచేయని తీరుపై ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా, ముఖ్యమంత్రిగా జగనన్న లక్ష్యంతోనే నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ మోరబోయిన గోవర్ధన రాధాకృష్ణ, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరామ్ శ్రీనివాసులు, ముడియాల అనంతరెడ్డి, గాయకవాడ సుభాషిణి, పందిటి వెంకటలక్ష్మి, సూరిపోగు మాల్యాద్రి, యం.అంకబాబు, పిన్నెబోయిన శ్రీరాములు, కాకు గంగయ్య, గోను శ్రీను, మోరబోయిన పండు, కుర్రా నాగరాజు, బైరబోయిన చెంగళరావు, చింతం సుధాకర్, బాల నాగయ్య, పిన్నెబోయిన నరసింహులు, చింతం రవి, నరసింహులు, మోహనరావు, వెంకటేశ్వర్లు, కంచర్ల గురవయ్య, పిన్నెబోయిన ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ విముక్తి తత్వవేత్త అంబేడ్కర్


మాట్లాడుతున్న ఇంగిలాల రామచంద్రరావు

కనిగిరిరూరల్: భారతదేశ విముక్తి తత్వవేత్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ ఇంగిలాల రామచంద్రరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు చదలవాడ బాలగురవయ్య అధ్యక్షతన అంబేడ్కర్ సిద్ధాంత అధ్యయన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ దేశంలో అంబేడ్కర్ చాలా మంది దృష్టిలో అణగారిన వర్గాల ప్రజలకు రిజర్వేషన్లు స్థాపకుడిగా ప్రచారం చేశారన్నారు. ఆయన భారత దేశ విముక్తి తత్వవేత్త అని వివరించారు. అనంతరం ఇంగిలాల రామచంద్రరావు రచించిన సామాజిక ప్రజాస్వామ్యతత్వవేత్త అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, పూలే సేవా సమితి అధ్యక్షుడు దేపూరి వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉపాధ్యాయులు పాపబత్తిన నారయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎనుబరి రవీంద్రబాబు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ యాసీన్, న్యాయవాది యరజాల బాల నారాయణ, బీటీపీ నాయకులు చీమలదిన్నె చిన వెంకయ్య తదితరులు పాల్గొన్నారు

భైరవకోనలో సందడి


భైరవకోన క్షేత్ర సందర్శనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పర్యాటకప్రాంతం, పుణ్యక్షేత్రం భైరవకోనకు భక్తులు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులతో శనివారం సందడిగా మారింది. ఈ సందర్భంగా భక్తులు, విద్యార్థులు త్రిముఖ దుర్గాదేవి ఆలయం, కాలభైరవ, భర్గులేశ్వర, నగరేశ్వర ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జలపాతం వద్ద ఉత్సాహంగా ఆటపాటలతో గడిపారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అర్చకులు, ఆలయ సిబ్బంది ఆలయ ప్రాశస్థం, సందర్శించాల్సిన ప్రదేశాలను వివరించారు. భక్తులకు, విద్యార్థులకు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్ సుందర్‌రాజు ఆధ్వర్యంలో వసతి, అన్నప్రసాదం సదుపాయాలు కల్పించారు.

పారిశుధ్యం, తాగునీటి సమస్యలు పరిష్కారం


సాక్షి ఎఫెక్ట్..
చిన్న కనుమళ్ల ఎస్సీ కాలనీలో మురుగుకాల్వలు బాగు చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సింగరాయకొండ: మండలంలోని కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్ల ఎస్సీ కాలనీలో శనివారం గ్రామ పంచాయతీ అధికారులు పారిశుధ్యం, తాగునీరు సమస్యలను పరిష్కరించారు. కాలనీవాసులు తాగునీరు, పారిశుధ్యం సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయని సమస్యలపై 'సమస్యల ఖిల్లా– చిన్న కనుమళ్ల' అన్న శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామ పంచాయతీ సర్పంచ్ మలినేని ఇందిర, కార్యదర్శి శాంతి ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది కాలనీలో మురుగుకాలువలు బాగుచేసి, తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు.